క్లుప్తంగా...

ఘనంగా రాముడి శోభాయాత్ర ర్యాలీ



బైరాగిగూడలో శోభాయాత్రలో పాల్గొన్న శ్రీరామ భక్తులు

బండ్లగూడ: జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శ్రీ రాముడి శోభాయాత్ర ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఐటీ ఉద్యోగులు, శిశు మందిర పూర్వ విద్యార్థి పరిషత్ కార్యకర్తలు, యువకులు బైరాగిగూడ నుంచి కాళీమందిర్ వరకు అయోధ్యలో శ్రీరామ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా శనివారం ఉదయం శోభాయాత్ర నిర్వహించారు. ద్విచక్ర వాహనాలతో జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ చిన్నలు, పెద్దలు ర్యాలీలో పాల్గొన్నారు.

అయోధ్య దర్శన్ అభియాన్ కన్వీనర్ నియమాకం



శ్రీధర్‌ను సన్మానిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: అయోధ్య దర్శన్ అభియాన్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కన్వీనర్‌గా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. శ్రీధర్ నియమితులైన సందర్భంగా శనివారం నాయకులు కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు జి. బాబురావు, ప్రధాన కార్యదర్శి బండారి బాలకృష్ణ, పసుపుల సందీప్ ముదిరాజ్, యువ మోర్చా రాజేంద్రనగర్ డివిజన్ ఉపాధ్యక్షులు ఎస్. విజయ్ కుమార్ స్వామి, లక్ష్మీనారాయణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని శుభ్రం చేసిన నాయకులు



రాజేంద్రనగర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు శనివారం రాజేంద్రనగర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని నాయకులు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, డివిజన్ అధ్యక్షులు జి.బాబురావు, బండారి బాలకృష్ణ, సందీప్ ముదిరాజ్, పులిమామిడి రవీందర్ స్వామి, నాగుల కిరణ్ గౌడ్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

మణికొండ చైర్మన్‌పై

అవిశ్వాసం!



మణికొండ మున్సిపల్ కార్యాలయం

పది మంది కౌన్సిలర్‌ల సంతకాలు

మణికొండ: రాష్ట్ర వ్యాప్తంగా పలు మున్సిపాలిటీలలో కొనసాగుతున్న అవిశ్వాసాల వేడి మణికొండ మున్సిపాలిటీకి తాకింది. మున్సిపాలిటీలో మొత్తం 20 మంది సభ్యులుండగా ఇప్పటికే 10 మంది చైర్మన్ కె.నరేందర్ ముదిరాజ్‌కు వ్యతిరేకంగా సంతకాలు సేకరించారు. వారిలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కె.రామకృష్ణారెడ్డి, బి.కావ్య శ్రీరాములు, వసంతరావు, పి.శైలజ వినోద్ కౌన్సిలర్లతో పాటు బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన ఎ.నవీన్ కుమార్, వి.హైమాంజలి అనిల్‌కుమార్, బీజేపీలోనే కొనసాగుతున్న శ్రీకాంత్‌స్వామి, ఎల్.వందన నగేష్, బి.శ్వేత రవికాంత్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి గెలిచిన బి.పద్మారావు ఉన్నట్టు సమాచారం. కాంగ్రెస్ నుంచి గెలుపొందిన ఏడుగురు కౌన్సిలర్‌లతో పాటు ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన యాలాల లావణ్య నరేష్‌తో కలిపి వారి బలం ఎనిమిదికి చేరింది. బీజేపీ పార్టీకి చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, ఇండిపెండెంట్ సభ్యురాలు కె.లక్ష్మీ నాగేశ్వర్‌రావులు సంతకాలు చేయని వారిలో ఉన్నట్టు తెలిసింది. ఇప్పటికే చైర్మన్‌కు వ్యతిరేకంగా పది మంది సంతకాల సేకరణ పూర్తి కావటంతో తీర్మానాలను కలెక్టర్ కార్యాలయానికి అందించే ఆలోచనలో ఉన్నట్టు స్థానికంగా ప్రచారం ఉంది.

నిబంధనలు ఇలా...

మణికొండ మున్సిపాలిటీలో మొత్తం 20 మంది కౌన్సిలర్‌లు ఉన్నందున 10 మంది సంతకాలతో అవిశ్వాస తీర్మానానికి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. దాన్ని వారు పరిగణలోకి తీసుకుని అవిశ్వాస తీర్మాన ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లే అవకాశం లేకపోలేదు. అవిశ్వాస తీర్మానం నిరూపించుకునేందుకు కలెక్టర్ పలు విచారణలు చేసిన తర్వాత తేదీని నిర్ణయిస్తారు. ఆ రోజు అవిశ్వాస తీర్మానం నెగ్గి చైర్మన్ పదవి నుంచి తప్పుకోవాలంటే 13 మంది సభ్యులు ఆయనకు వ్యతిరేకంగా ఓటు వేయాల్సి ఉంటుంది. అందులో ఒక్కరు తగ్గినా అవిశ్వాస తీర్మానం వీగిపోయే అవకాశం ఉంది.

కారణాలపై చర్చ..

మణికొండ మున్సిపాలిటీలో గత కౌన్సిలర్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నుంచి 8, బీజేపీ నుంచి 6, బీఆర్ఎస్ నుంచి 5, ఇండిపెండెంట్‌గా ఒకరు గెలుపొందారు. చైర్మన్ అయ్యేందుకు పూర్తి స్థాయి మెజారిటీ ఎవరికీ లేకపోవటంతో చర్చల అనంతరం కాంగ్రెస్ నుంచి చైర్మన్, బీజేపీ నుంచి వైస్ చైర్మన్ పదవులు తీసుకున్నారు. అప్పటి నుంచి అంతా సవ్యంగానే ఉన్నా ఇప్పుడు చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టడానికి గల కారణం ఏమిటని మున్సిపాలిటీ వ్యాప్తంగా చర్చ కొనసాగుతుంది. అతన్ని పదవి నుంచి తప్పించేందుకు అవసరమయ్యే 13 మంది సభ్యుల మద్దతు లేదని తెలిసినా అవిశ్వాసానికి దారి తీసిన పరిస్థితులపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో వివిధ మరమ్మతుల నిమిత్తం ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ ప్రవీణ్ తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని కాటేదాన్ ఇండస్ట్రీయల్ ఏరియా, సాయిబాబానగర్, గంగోత్రి ఇండస్ట్రీయల్ లేన్, టీఎస్‌జీవోస్ కాలనీ, అమ్మాగార్డెన్ ప్రాంతాలలో ఉదయం 10:30 నుంచి 1:30 గంటల వరకు, కాటేదాన్ పారిశ్రామిక వాడలోని రవిఫుడ్స్ కంపెనీ, నేతాజీనగర్, శ్రీరామ్‌నగర్‌లో మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 4:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను విడుదల చేస్తున్న రిజిస్ట్రార్

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని రిటైర్డ్ నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రచురించిన 2024 సంవత్సరం కేలండర్‌ను శనివారం విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ వెంకటరమణ ఉద్యోగ సంఘం నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటేశ్వర్‌రావు, పెంటయ్య, వెంకటేశ్వర్లు, షేక్‌మౌలానా, కృష్ణ, తహెర్‌ఖాన్, యాదయ్య. అనంతయ్య, ప్రభుదాస్, పెంటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్వాల్‌గూడలో కొత్త సొబగులు



ఎకోపార్కులో సిద్ధమవుతున్న పార్కులు

శంషాబాద్: కొత్వాల్‌గూడలో హెచ్‌ఎండీఏ ఎకో (పర్యావరణ) పార్కు పనులు చకచకా జరుగుతున్నాయి..మొదటి ఫేస్‌లో భాగంగా కొండలు.. లోయల్లో నుంచి వంతెనలు..నడిచివెళ్లేందుకు వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాట్లు జరుగుతున్నాయి...ప్రధాన పార్కుతో ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న ఏవియరీ (పక్షుల) పార్కును అనుసంధానం చేస్తూ వీటిని ఏర్పాటు చేస్తున్నారు. బటర్‌ఫ్లై పార్కు పనులు ఇప్పటికే దాదాపుగా పుర్తయ్యాయి..105 ఎకారల్లో జరుగుతున్న పర్యావరణ పార్కు నగరానికి తలమానికంగా మారనుంది. ఇంకా కాటేజీలు, ఫుడ్ కోర్టులు, అడ్వెంచర్ పార్కులు పూర్తయితే ఇది ప్రజలకు అందుబాటులోకి రానుంది.

విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తాం



తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కౌన్సిలర్ శివారెడ్డి

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తామని కోకాపేట కౌన్సిలర్ జి.శివారెడ్డి అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేకపోవటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే విషయాన్ని ఉపాధ్యాయులు, కౌన్సిలర్‌లు, విద్యాకమిటీ నాయకులు, రౌండ్ టేబుల్ ఇండియా, ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్ సంస్థల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే వారు స్పందించి రెండు తరగతి గదులను నిర్మించేందుకు ముందుకు వచ్చారు. దాంతో శనివారం అదనపు తరగతుల నిర్మాణానికి కౌన్సిలర్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాములు, ఉపాధ్యాయులు మాదవరెడ్డి, నాగేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన డ్రోన్లపై శిక్షణ

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గత 15 రోజులుగా జరిగిన మహిళల డ్రోన్ల పై శిక్షణ ముగిసింది. ఉత్తప్రదేశ్ నుంచి వచ్చిన మహిళలకు మొదటి సారిగా డ్రోన్ల పై శిక్షణ ఇచ్చి వారికి సర్టిఫికెట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ మహిళలకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంను అందించి వ్యవసాయ రంగంలో భాగస్వాములను చేసి వారిని అభివృద్ధిలోకి తీసుకరావడమే మా ధేయ్యమని అన్నారు. డ్రోన్ల పై శిక్షణ పొందిన మహిళలు తమ గ్రామాలలోని స్వయం సహాయ సంఘాలలోని మహిళలకు నేర్పించాలని సూచించారు.



డ్రోన్ల పై శిక్షణ పొందిన ఉత్తర ప్రదేశ్‌కు చెందిన మహిళలు

రోడ్ల పై వ్యర్థాలు వేస్తే భారీ జరిమాన



అధికారులతో సమావేశమైన డీసీ రవి కుమార్

రాజేంద్రనగర్: ఖాళీ ప్రదేశాలు, రోడ్లు, చౌరస్తాలు తదితర ప్రాంతాల్లో అక్రమంగా నిర్మాణ సామాగ్రిని డంపింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ సూచించారు. శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో డ్రైవర్లు, ఆర్టీఏ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ రవి కుమార్ మాట్లాడుతూ... రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ప్రైవేటు లారీ ఓనర్లు, డ్రైవర్లు భవన నిర్మాణ వ్యర్థాలను నిర్దేశించిన ఆరాంఘర్ చౌరస్తా, మెహిదీపట్నం పిల్లర్ నంబర్-55, పీపుల్స్ ప్లాజా, కోఠి ప్రాంతాల్లో మాత్రమే వేయాలన్నారు. నిర్దేశించిన ప్రాంతాల్లో కాకుండా మూసి పరివాహక ప్రాంతాలు, రోడ్లు తదితర ప్రాంతాల్లో వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మొదటిసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే రూ.25 వేలు, రెండోసారి పాల్పడితే రూ.50 వేలు, మూడోసారి పాల్పడితే రూ.1 లక్ష జరిమాన విధించాలన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

అత్తాపూర్: గంజాయి ప్యాకెట్లను రవాణా చేస్తూ విక్రయిస్తున్న ఓ వ్యక్తిని శంషాబాద్ ఎక్సైజ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 58 ప్యాకెట్ల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..శివరాంపల్లి వీఎస్ కాలనీ ప్రాంతానికి చెందిన రిషిరాజ్ కుమార్ (24) గత కొంతకాలంగా గంజాయిని గుట్టు చప్పుడు కాకుండా అవసరమైన కస్టమర్లకు విక్రయిస్తున్నాడు. కాగా శనివారం ద్విచక్ర వాహనం (ఏపీ 13 ఏఏ4510)పై మెహిదీపట్నం నుంచి శివరాంపల్లి వస్తుండగా శంషాబాద్ ఎక్సైజ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రిషిరాజ్ కుమార్ వాహనంలో 58 ప్యాకెట్ల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 70 ప్యాకెట్ల ఎండు గంజాయిని గుర్తు తెలియని వ్యక్తి రూ.200కు కొనుగోలు చేసిన రిషిరాజ్ కుమార్ 12 గంజాయి ప్యాకెట్లను అవసరమైన కస్టమర్లకు రూ.400లకు విక్రయించాడు. మిగిలిన 58 గంజాయి ప్యాకెట్లతో వెళుతున్న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ప్రభుత్వ భూమికి ప్రైవేటు ప్రహరీ

- గతంలోనే కూల్చివేతలు
- తిరిగి ప్రహరీ నిర్మాణాలు



ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన ప్రహరీ

మణికొండ: అది ఔటర్ రింగ్‌రోడ్డుకు పక్కనే ఉన్న విలువైన ప్రభుత్వ భూమి. దాన్ని ఎలాగైనా కబ్జా చేయాలనే ఉద్దేశంతో కొందరు వ్యక్తులు పత్రాలను సృష్టించి రంగంలోకి దిగారు. ఆ విషయాన్ని గతంలో పత్రికల్లో కథనాలు రావటంతో స్పందించిన అప్పటి రెవెన్యూ అధికారులు వాటిని కూల్చివేశారు. ప్రస్తుతం ప్రభుత్వంతో పాటు అధికారులు మారడంతో మరోమారు దాన్ని కబ్జా చేసేందుకు యత్నించే క్రమంలో ప్రహరీని నిర్మిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే నార్సింగి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 205లో 80 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. అందులో సగం వరకు ఔటర్‌రింగ్ రోడ్డు నిర్మాణంలో పోయింది. మరో 8 ఎకరాల్లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 60 గజాల ఇళ్ల పట్టాలను ఇచ్చింది. మరికొంత భూమిని మాజీ సైనికులకు ఇంటి స్థలాల రూపంలో ఇచ్చింది. అవన్నీ పోను మరికొంత భూమి సదరు సర్వే నెంబర్‌లో ఉంది. దాన్ని ఎలాగైనా కబ్జాలు చేయాలని కొంత కాలంగా పాత పత్రాలు, జీవోలు తెచ్చి ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారు. ఔటర్‌రింగ్ రోడ్డును ఆనుకుకొని ఉన్న 4 ఎకరాల భూమిని ఓ నిర్మాణ సంస్థ బ్లూషీట్‌లను ఏర్పాటు చేసుకుంది. అక్కడ ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని సైతం రాత్రికి రాత్రి తొలగించి తమ ఆధీనంలోకి తీసుకుంది. అదే క్రమంలో నల్లచెరువు పక్కనే ఉన్న మరో ఎకరం భూమికి శనివారం ప్రహరీ నిర్మాణం పనులను చేపట్టారు. గతంలో ఇదే భూమిని మాజీ సైనికులకు ఇచ్చారని వారి తరపువారు గదులను నిర్మాణం చేపడితే అప్పటి రెవెన్యూ అధికారులు తొలగించారు. వారికి ఇచ్చిన భూమి పక్కన ఉందని, అందులో ఉన్నవారు ఉన్నారని, మిగులు భూమిలోకి నకిలీ పట్టాలతో మాజీ సైనిక ఉద్యోగుల పేరుతో వస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎకరం 50 కోట్లకు పైగా పలికే ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి చేతులు మారుతుందని, అధికారులు స్పందించి దాన్ని పరిరక్షించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

పరిశీలించి కూల్చివేస్తాం

నార్సింగి సర్వేనెంబర్ 205లో ఇంటి స్థలాలకు, ఔటర్ రింగ్ రోడ్డుకు భూమి కేటాయించారు. నల్లచెరువు పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో వచ్చే ఆక్రమణలను సహించం. వాటిని పరిశీలించి నిర్మాణాలను కూల్చివేస్తాం. -తహసీల్దార్ గోవర్ధన్

టిస్టాను సందర్శించిన జర్మనీ ప్రతినిధులు



రాజేంద్రనగర్: ఇండో జర్మన్ సహకార ప్రాజెక్టులో భాగంగా తెలంగాణ విత్తన ధృవీకరణ సంస్థను, జర్మనీ ఎంబాసికి సంబంధించిన 10 మంది ప్రతినిధులు విత్తన ధృవీకరణ సంస్థకు చెందిన అంతర్జాతీయ విత్తన పరీక్ష ల్యాబ్ (టిస్టా)ను సందర్శించారు. రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థ అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించి టిస్టాలో ఉన్న అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పరిచిన పరికరాలను, విత్తన పరీక్ష విధానాన్ని గురించి వివరించారు. సందర్శన అనంతరం అధికారులు వారికి తెలంగాణ రాష్ట్రం గ్లోబల్ సీడ్ హబ్‌గా ఎదిగింది, తెలంగాణ ధృవీకరణ సంస్థకి చెందిన టిస్టా ల్యాబ్ ఇస్టా అక్రిడిటేషన్ గుర్తింపు ఎలా పొందిందనే అనే అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జర్మనీ ప్రతినిధులు మాట్లాడుతూ... విత్తన ఎగుమతులను ప్రోత్సాహించేందుకు తెలంగాణలో అంతర్జాతీయ ప్రమాణాలతో టిస్టాను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలోని రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడంతో పాటు విత్తన కంపెనీలు తమ ఎగుమతులను పెంచుకొని విస్తరించేందుకు ఈ ల్యాబ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ సమావేశంలో జర్మనీ ప్రతినిధులు ఇండో-జర్మన్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్, విత్తన ధృవీకరణకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్‌లను అనుమతించండి



ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న టిప్పర్ యజమానులు

మణికొండ: అత్యధిక భవనాలు నిర్మాణం అవుతున్న నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో టిప్పర్‌లకు ఎక్కువ సమయం నో ఎంట్రీ పెట్టడంతో తీవ్రంగా నష్టపోతున్నామని, కావున ఎక్కువ సమయం కల్పించాలని టిప్పర్‌ల యజమానులు ట్రాఫిక్ పోలీసులను కోరారు. శనివారం నార్సింగి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డిని కలిసి వారి సమస్యను వివరించారు. ఉదయం 11 గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి టిప్పర్‌లను ప్రస్తుతం అనుమతించటం లేదన్నారు. తమకు ఉన్న ఆర్డర్‌ల ప్రకారం నిర్మాణ సామాగ్రిని సకాలంలో అందించాల్సి వస్తుందన్నారు. అలా అందించలేని పరిస్థితిలో తమతో పాటు డ్రైవర్‌ల ఉపాధి పోతుందన్నారు. నిర్మాణం రంగం సైతం వేగం తగ్గుతుందని వారు పేర్కొన్నారు. తమ వాహనాలను అన్ని సమయాల్లో అనుమతించే వరకు తాము సమ్మె చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టిప్పర్‌ల యజమానులు, డ్రైవర్‌లు ఉన్నారు.